Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 288 | మంగళవారం 05 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## టీవీకే పార్టీ అద్భుత విజయం సాధించింది

- విజయ్‌కి ఫోన్ చేసి అభినందనలు తెలియజేశా
- రాహుల్ గాంధీ ట్వీట్
- ప్రజా సమస్యలపై పోరాటం కాంగ్రెస్ కొనసాగిస్తుంది



2లో

## ప్రజల తీర్పును అంగీకరిస్తున్నాం

### - తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై - సూర్య వాస్తవం



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సీఎం స్టాలిన్ స్పందించారు. రెండోసారి తమదే అధికారం అనుకున్న ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) పార్టీకి చుక్కెదురైంది. అయితే ఈ చేదు ఫలితాలపై సీఎం ఎంకే స్టాలిన్ భావోద్వేగంతో స్పందించారు. ప్రజల తీర్పును అంగీకరిస్తున్నామని పేర్కొన్న డీఎంకే అధినేత.. విజరు పార్టీ టీవీకే పేరెత్తకుండానే విజేతలకు అభినందనలు తెలిపారు.
అసెంబ్లీ ఎన్నికల్లో భారీ పరాజయంతో కంగుతిన్న స్టాలిన్ ఎక్స్ పోస్ట్‌లో రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ పెట్టిన ఆయన తమ ఐదేండ్ల పాలనలో

- మిగతా 2లో..

## పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ఓటమి

### - అధికార తృణమూల్‌కు మరో షాక్

కోల్‌కతా - సూర్య వాస్తవం



పశ్చిమబెంగాల్‌లో అధికారాన్ని కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు మరో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్ర సీఎం, ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ భవానీపూర్ నియోజకవర్గంలో ఓటమిని చవి చూశారు. బీజేపీ నేత సువేందు అధికారి ఆమెపై 15 వేల ఓట్లకు పైగా మెజారిటీతో విజయం సాధించారు. ఆమె గత అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి పోటీ చేయగా.. అక్కడి నుంచి కూడా పోటీ చేసిన సువేందు అధికారి మమతను ఓడించారు. దీంతో ఆమె ఎమ్మెల్యేగా గెలుపొందడం అనివార్యం కావడంతో ఆ తర్వాత ఆమె భవానీపూర్ నుంచి పోటీ చేసి, గెలిచి సీఎం పదవిలో కొనసాగారు.

- మిగతా 2లో..



# తమిళనాట విజయ విహారం

- మార్పు కోరిన ఓటరు ◆ తమిళనాడులో విజయ్ సంచలనం
- బెంగాల్‌లో కమలం పాగా ◆ కేరళంలో యూడీఎఫ్..
- అసోం, పుదుచ్చేరిలో మరోసారి బీజేపీకే అధికారం..

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఐదు రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల్లో ఓటర్లు విభిన్నమైన తీర్పునిచ్చారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో అధికార మార్పిడిని కోరుకున్న ప్రజలు అసోం, పుదుచ్చేరిలో మాత్రం అధికార పార్టీనే మరోసారి గెలిపించారు. తమిళనాడులో టీవీకే అధినేత విజయ్ విజయబావుటా ఎగరేసి అందరినీ ఆశ్చర్యపరచగా బెంగాల్‌లో పదిహేన్నేండ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు తెర పడింది. కేరళంలో యూడీఎఫ్ అధికారా న్ని హస్తగతం చేసుకుంది. తమిళనాడు శాసనసభలో మొత్తం 234 స్థానాలు ఉండగా టీవీకే 107 చోట్ల విజయం సాధించింది. అధికార డీఎంకే 74 స్థానాల కే పరిమితమైంది. అన్నా డీఎంకే- బీజేపీ కూటమి 52 స్థానాలతో సరిపెట్టు కోవాల్సి వచ్చింది. పట్టాలి మక్కల్ కచ్చి (పీఎంకే)కు నలుగు, కాంగ్రెస్‌కు ఐదు స్థానాలు దక్కా యి. సీపీఐ(ఎం), ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్), సీపీఐ, విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) రెండేసి స్థానాలు గెలుచుకున్నాయి. పశ్చిమ బెంగాల్ శాసనసభలో 294 స్థానాలు ఉండగా బీజేపీ 206 స్థానాలను గెలుచుకుంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ 81 స్థానాలకే పరిమితమైంది. కాంగ్రెస్, అమ్ జనతా ఉన్నయన్ పార్టీ (ఏజేయూపీ)కి రెండేసి స్థానాలు వచ్చాయి. సీపీఐ (ఎం), ఆల్ ఇండియా సెక్యులర్ ఫ్రంట్ (ఏఐఎస్ఎఫ్) ఒక్కో స్థానంలో విజయం సాధించాయి. కేరళంలో మొత్తం 140 స్థానాలు ఉండగా కాంగ్రెస్ 63, సీపీఐ (ఎం) 26, ఐయూఎంఎల్ 22, సీపీఐ 8, కేఈసీ 7, ఆర్ఎస్‌పీ 3, బీజేపీ 3 స్థానాలు గెలుచుకు న్నాయి. ఇతరులు, స్వతంత్రులు 8 స్థానాల్లో విజయం సాధించారు. అసోంలో బీజేపీ 82 స్థానాలు గెలుచుకొని మరోసారి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ 19 స్థానాలు సాధించింది. బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీఓపీఎఫ్), అసోం గణపరిషత్ చెరో పది స్థానాలు దక్కించు కున్నాయి. ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్), రైజోర్‌దళ్ చెరో రెండు స్థానాలు, తృణమూ ల్ కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నాయి. పుదుచ్చేరిలో ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్‌సీ) 12 స్థానాలలో విజయం సాధించింది. డీఎంకే ఐదు, బీజేపీ నాలుగు స్థానాలు గెలుపొందగా ఇతర పార్టీలు, స్వతంత్రులు 9 సీట్లలో విజయం సాధించారు.

### చరిత్ర సృష్టించిన విజయ్

తమిళనాడులో సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత

- మిగతా 2లో..

## ఇక బెంగాల్‌లో భయం ఉండదు

- అసోంలో అభివృద్ధికి మద్దతు
- ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోడీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



పశ్చిమ బెంగాల్‌లో ప్రజల శక్తి విజయం సాధించిందని, బిజెపి సుపరిపాలన రాజకీయాలు గెలిచాయని ప్రధాన మంత్రి

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# కేరళంలో యుడిఎఫ్ విజయం


### - ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం : సీపీఎం
### - మతోన్మాద రాజకీయాలపై పోరు సాగుతుందని స్పష్టీకరణ

తిరువనంతపురం - సూర్య వాస్తవం



కేరళ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) విజయం సాధించింది. 102 సీట్లు గెలుచుకుని సంపూర్ణ మెజారిటీ దక్కించుకుంది. కాగా ఎల్‌డిఎఫ్ 35సీట్లకే పరిమితమైంది. ఎన్‌డిఎ మాత్రం మూడు స్థానాలను గెలుచుకోగలిగింది 2025 స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రదర్శించిన ఆధిపత్యాన్ని మూడు నెలల తర్వాత ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ యుడిఎఫ్ పునరావృతం చేసింది. యుడిఎఫ్‌లో కాంగ్రెస్ 63సీట్లు గెలుచుకోగా, ముస్లిం లీగ్ 22 స్థానాలను గెలుచుకుంది. కేరళ కాంగ్రెస్‌కు ఏడు సీట్లు లభించాయి. ఇక ఎల్‌డిఎఫ్‌లో సిపిఎంకు 26సీట్లు రాగా, సిపిఐకి 8 స్థానాలు, ఆర్‌జెడి కి ఒక స్థానం లభించింది.
ప్రతిపక్ష నేత వి.డి.సతీశన్, డిప్యూటీ నేత పి.కె.కున్హాలికుట్టీ (ముస్లిం లీగ్), మాన్స్ జోసెఫ్ (కేరళ కాంగ్రెస్), అపూ జోసెఫ్ (పి..జె.జోసెఫ్ కుమారుడు), శిబూ బేబీ జాన్ (ఆర్ఎస్‌పి), సిపి.జాన్ (సిఎంపి)లతో సహా ప్రధాన యుడిఎఫ్ నేతలు విజయం సాధించారు. అయితే టి.ఎన్.ప్రతాపన్, వి.ఎస్.శివకుమార్‌లు వంటి ప్రముఖ నేతలు ఓటమి చవి చూశారు. పోటీచేసిన మంత్రుల్లో ముఖ్యమంత్రి

- మిగతా 2లో..



## ప్రతి జిల్లాలో మెగా ఇండస్ట్రియల్ పార్కు

- పారిశ్రామిక క్లస్టర్లకు లాజిస్టిక్స్ కనెక్టివిటీ
- గ్లోబల్ బ్రాండ్లుగా స్థానిక ఉత్పత్తులు
- రవాణా వ్యయం తగ్గించటమే కీలకమైన అంశం
- ప్రొడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి- సూర్య వాస్తవం

ప్రతి జిల్లాలోనూ ఒక మెగా పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుదు ఆదేశించారు. సచివాలయంలో సోమవారం ప్రొడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై పరిశ్రమలు, ఇతర శాఖల ఉన్నతాధి కారులతో అయన సమీక్షించారు.

- మిగతా 2లో..

# ప్రజల తీర్పును అంగీకరిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

సాధించిన ఘనతలు వివరిస్తూనే.. ఇకపై ప్రతిపక్షంగా క్రియాశీలక పాత్ర పోషిస్తామని రాష్ట్ర ప్రజలకు వెల్లడించారు. ""ప్రజల తీర్పును డీఎంకే గౌరవిస్తోంది. ఎన్నికల్లో విజేతలకు అభినందనలు. గత ఐదేళ్లలో తమిళనాడులో ఎన్నో ప్రాజెక్టులు చెపట్టాం. ప్రజలకు మంచి పాలన అందించాం. ప్రతి రంగంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన నడిపాం. మా పార్టీ సాధించిన విజయాలను చూసి ఓటెయ్యాలని ఎన్నికల ప్రచారంలో అభ్యర్థించాం. ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు కొనసాగించాలనే ఉద్దేశంతోనే మేము డీఎంకేకు మరోసారి ఓటెయ్యాలని కోరాం. ద్రవిడ మున్నేట్ర కజగం సారథ్యంలోని లౌకిక, అభ్యుదయ కూటమికి ఓటేసిన తమిళ ప్రజలకు నేను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. డీఎంకే పార్టీకి ఓటు వేసిన వారి కోసమే కాకుండా ఓటేయ్యని వారి కోసం కూడా మేము పనిచేశాం. రాష్ట్ర ప్రజానీకం పట్ల నేను నిజాయతీగా ఉన్నాను. నా ఆలోచనలకు తగ్గట్టుగా విధులు నిర్వర్తించాను. నా శక్తి కొద్దీ శ్రమించాను. నా ప్రియమైన కరుణానిధి కామ్రేడ్.. నా లెక్కనే ఆయన నిజాయతీగా సేవలందించారు. ఆయనను నా నుంచి వేరు చేయలేరు. ఆయనకు మనసారా కతజ్ఞతలు తెలియజేస్తున్నా" అని వివరించారు. కాగా తనకు కంచుకోట అయిన కళాతూర్ నియోజకవర్గంలో స్టాలిన్ ఓడిపోయారు. గతంలో డీఎంకేలో కీలక నేతగా ఉండి.. టీవీకే తరఫున పోటీచేసిన బీఎస్ బాబు చేతిలో స్టాలిన్ ఊహించని పరాజయం చవిచూశారు.

# పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ఓటమి

(మొదటిపేజీ తరువాయి)

ఈ సారి కూడా భవానీపూర్ నుంచి పోటీ చేసిన మమతను సువేందు అధికారి ఓడించడం గమనార్హం.

**అనైతికం.. అక్రమం**

**ఇది ప్రజాస్వామ్యబద్ధంగా వచ్చిన గెలుపుకాదు : ఓటమిపై మమత స్పందన**

పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఫలితాలపై సీఎం మమతా బెనర్జీ స్పందించారు. తమ పార్టీ అధికారాన్ని కోల్పోవడం, ఆమె పోటీ చేసిన స్థానం నుంచి కూడా గెలవకపోవడంపై మాట్లాడిన ఆమె.. బీజేపీ విజయంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యబద్ధంగా వచ్చిన గెలుపు కాదనీ, పూర్తిగా లూటీ అని ఆరోపించారు. ఎన్నికల కమిషన్‌ను కూడా ఆమె టార్గెట్ చేశారు. ఈసీ బీజేపీ కమిషన్‌గా మారిందని అన్నారు. బీజేపీ సుమారు వందకు పైగా స్థానాలను లూటీ చేసిందని చెప్పారు. దీనిపై తాము చేసిన ఫిర్యాదులను అధికారులు పట్టించుకోలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీది అనైతిక విజయమన్నారు. కేంద్ర బలగాలు, కేంద్ర మంత్రుల అండతో చేసిన అక్రమమని ఆరోపించారు. ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా ఉన్నప్పటికీ.. తృణమూల్ కాంగ్రెస్ మళ్లీ బలం పుంజుకుంటుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# ఇక బెంగాల్‌లో భయం ఉండదు

(మొదటిపేజీ తరువాయి)

నరేంద్ర మోడీ అన్నారు. అస్సోంలో ఎన్‌డిఎ విజయం అభివృద్ధిపై పాలక కూటమికి ఉన్న అచంచలమైన మద్దతును తెలియజేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని సోమవారం మాట్లాడుతూ.. బిజెపికి పశ్చిమ బెంగాల్ అద్భుతమైన తీర్పు ఇచ్చిందని, ప్రజల కలలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి పార్టీ అన్ని విధాలా కృషి చేస్తుందని మోడీ హామీ ఇచ్చారు. బిజెపి సుపరిపాలన రాజకీయాలు గెలిచాయన్నారు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి సాధించిన రికార్డు విజయం తరతరాలుగా పార్టీ కార్యకర్తల కృషి, పోరాటాలు లేకుండా సాధ్యం కాదని మోడీ అన్నారు. వారే తమ పార్టీకి బలమని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని సమాజంలోని అన్ని వర్గాలకు అవకాశం, గౌరవాన్ని కల్పించే ప్రభుత్వాన్ని బిజెపి అందిస్తుందని మోడీ చెప్పారు. అస్సోం మరోసారి బిజెపి-ఎన్‌డిఎను ఆశీర్వదించిందని అన్నారు. అస్సోం ఎన్నికల్లో నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) విజయం అభివృద్ధిపై దాని ప్రాధాన్యతకు, ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి ఉన్న అచంచలమైన మద్దతును తెలియజేస్తుందని చెప్పారు. ఈశాన్య రాష్ట్ర ప్రజల మధ్య రాత్రింబవళ్లు కృషి చేసిన బిజెపి-ఎన్‌డిఎ కార్యకర్తలందరినీ ప్రశంసిస్తూ, గత 10 సంవత్సరాలుగా పార్టీ, కూటమి అభివృద్ధి ప్రశంసనీయన్నారు. పుదుచ్చేరి ప్రజలకు కూడా ఎన్‌డిఎకు మరో విజయాన్ని అందించినందుకు ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం సుపరిపాలన, ఎన్. రంగస్వామి నేతృత్వంలోని ప్రభుత్వం చేసిన కృషి ఆధారంగా, పుదుచ్చేరి ప్రజలు ఎన్‌డిఎను మరోసారి ఆశీర్వదించారని అన్నారు. పుదుచ్చేరిలోని ఎన్‌డిఎ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చేసిన అసాధారణ కృషికి తాను చాలా గర్వపడుతున్నానని మోడీ అన్నారు, కేరళంలో బిజెపి-ఎన్‌డిఎకు ఓటు వేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. వికసిత కేరళ విజన్‌ను సాకారం చేయడానికి కృషి చేస్తామన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికలలో యుడిఎఫ్ విజయం సాధించినందుకు అభినందిస్తున్నానని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలో?ల ప్రజల సమస్యలను పరిష్కరించడంలో, వారి జీవితాలను మెరుగుపరచడంలో కూటమి ఎల్లప్పుడూ ముందుంటుందని మోడీ అన్నారు. టివికె అద్భుతమైన పనితీరు కనబరిచినందుకు అభినందనలు తెలియజేశారు. తమిళనాడు అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కేంద్రం అన్ని విధాలా కృషి చేస్తుందని చెప్పారు.

# టీవీకే పార్టీ అద్భుత విజయం సాధించింది

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన టీవీకే పార్టీ అధినేత విజయ్‌కు లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. టీవీకే పార్టీ అధినేత విజయ్‌తో మాట్లాడానని, పార్టీ సాధించిన అద్భుతమైన ఫలితానికి ఆయనను అభినందించానని పేర్కొన్నారు. ప్రస్తుతం యువగళం పెరుగుతోందనడానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని అన్నారు. తమిళనాడు, పుదుచ్చేరిలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. తమిళనాడు, పుదుచ్చేరి ప్రజల కోసం పార్టీ పని చేస్తుందని హామీ ఇచ్చారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 100కు పైగా స్థానాల్లో విజయం సాధించింది. డీఎంకే 70కి పైగా, అన్నాడీఎంకే 50కి పైగా స్థానాలతో సరిపెట్టుకున్నాయి. పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాలలో బీజేపీ, మిత్రపక్షాలు విజయం సాధించాయి. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అధికారం చేజిక్కించుకుంది.

# తమిళనాట విజయ విహారం

(మొదటిపేజీ తరువాయి)

జోసఫ్ విజయ్ చంద్రశేఖర్ సంచలనం సృష్టించారు. తమిళ రాజకీయాలలో అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. టీవీకేను ఏర్పాటు చేసిన రెండు సంవత్సరాల రెండు నెలల వ్యవధిలోనే ఆయన అధికారాన్ని కైవసం చేసుకున్నారు. తద్వారా యావత్ దేశం దృష్టినీ ఆకర్షించారు. తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో డీఎంకే విజయం సాధిస్తుందని అన్ని ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేసినప్పటికీ వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ అప్రతిహత విజయంతో దూసుకుపోయారు. విజయ్ ప్రభావం పెద్దగా ఉండదని, ఆయన కొన్ని ఓట్లు మాత్రమే చీలుస్తారని కొందరు అంచనా వేశారు. హంగ్ ఏర్పడితే ఆయన కింగ్‌మేకర్ అవుతారని మరికొందరు జోస్యం చెప్పారు. అయితే తమిళ ఓటర్లు మాత్రం ఉవ్వెత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి విజరుకు నీరాజనం పలికారు. పార్టీ ఆవిర్భావం తర్వాత తొలి ప్రయత్నంలోనే విజయ్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోవడం ఇప్పుడు తీవ్ర చర్చనీ యాంశమైంది. విజరు చాలా వరకూ సామాన్యులకే పార్టీ టిక్కెట్లు కట్టబెట్టి తన ప్రత్యేకతను చాటుకున్నారు. రాజకీయ వారసత్వానికి భిన్నంగా కింది స్థాయిలో పనిచేసిన కార్యకర్తలకే ప్రాధాన్యత ఇచ్చారు. తన వద్ద మూడు దశాబ్దాలకుపైగా కారు డ్రైవరుగా పనిచేసి, ప్రస్తుతం సహాయకుడిగా కొనసాగుతున్న రాజేంద్రన్ కుమారుడు శబరినాథన్‌ను చెన్నైలోని విరుగంబాక్కం స్థానం నుంచి పోటీకి దింపి గెలిపించారు. అలాగే రోయపురం స్థానంలో ఆటో డ్రైవర్ కె.విజయ్ ధాముకు టిక్కెట్ ఇవ్వగా ఆయన ఐదుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన డాక్టర్ జయకుమార్ (అన్నా డీఎంకే), మాజీమంత్రి రెహ్మాన్ ఖాన్ తనయుడు సుబైర్ ఖాన్‌లను ఓడించి విజయం సాధించారు.

**నాటి అనుచరుడే నేటి ప్రత్యర్థి**

బెంగాల్‌లో ఒకప్పుడు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి వెన్నంటి నిలిచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన సువేందు అధికారి ఆ తర్వాత బీజేపీ గూటికి చేరి మమతకు కంటిలో నలుసులా మారారు. మమత ప్రభుత్వాన్ని గద్దె దించడంలో కీలక పాత్ర పోషించారు. బీజేపీ పక్షాన ఆయనే బెంగాల్ తొలి ముఖ్యమంత్రి అవుతారన్న వార్తలు వస్తున్నాయి. నందిగ్రామ్‌లో సెజ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి సువేందు నేతృత్వం వహించారు. మమతతో కలిసి పోరాటం సాగించారు. 2011లో ఏర్పడిన తృణమూల్ ప్రభుత్వంలో ఆయన పలు శాఖలు నిర్వహించారు. పార్టీలో నెంబర్ 2గా కొనసాగారు. అయితే పార్టీలో మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ హవా నడవడంతో సువేందు తృణమూల్‌తో అనుబంధాన్ని తెంచుకొని బీజేపీలో చేరారు. 2021లో నందిగ్రామ్‌లో సీఎం మమతా బెనర్జీని ఓడించి సంచలనం సృష్టించారు. అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా ఎన్నికయ్యారు. ప్రస్తుత ఎన్నికలలో బీజేపీ విజయంలో కీలకపాత్ర పోషించారు.

**అసోంలో బీజేపీ హ్యాట్రిక్ విజయం**

అసోంలో బీజేపీ ప్రభుత్వం వరుసగా మూడోసారి శాసనసభ ఎన్నికలలో విజయం సాధించింది. ఈ ఎన్నికలలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కీలక పాత్ర పోషించారు. అసోంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఆయన మంత్రిగా, ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2015లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన బిశ్వశర్మ అసోం గణపరిషత్, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ వంటి కీలక ప్రాంతీయ పార్టీలతో పొత్తులు పెట్టుకున్నారు. తద్వారా కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లను ఏకీకృతం చేశారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం, యూసీసీ అమలు వంటి నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను సమర్థించి హిందూ ఓట్లను సంఘటితపరిచారు. దుందుడుకు ప్రకటనలతో జాతీయవాదిగా గుర్తింపు పొందారు. తరుణ్ గొగోరు నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అసోంను పదిహేను సంవత్సరాల పాటు పాలించింది. దీంతో అక్కడి ప్రజలలో ఆ పార్టీపై వ్యతిరేకత వ్యక్తమైంది. దానిని అవకాశంగా తీసుకున్న బిశ్వశర్మ బీజేపీ వైపు ఓటర్లను ఆకర్షించగలిగారు.

**రెండు స్థానాల్లోనూ 'విజయ్'కేతనం**

టీవీకే అధినేత విజయ్ తాను పోటీ చేసిన పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాలలో జయకేతనం ఎగరేశారు. పెరంబూర్‌లో ఆయన తన సమీప ప్రత్యర్థి, డీఎంకే అభ్యర్థి ఆర్‌డీ శేఖర్‌పై గెలుపొందారు. తిరుచ్చి ఈస్ట్‌లో అదే పార్టీ అభ్యర్థి ఇరుదయరాజ్‌పై గెలుపొందారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, అన్నా డీఎంకే నేత పళనిస్వామి ఎడప్పాడి నియోజకవర్గంలో 90 వేలకు పైగా ఓట్ల మెజారిటీ సాధించారు. కాగా తెలంగాణ మాజీ గవర్నర్, బీజేపీ అభ్యర్థి తమిళసై మైలాపూర్ నియోజకవర్గంలో మూడో స్థానానికే పరిమితమయ్యారు.

**తమిళనాట కలిసొచ్చేదెవరో?**

తమిళనాడులో టీవీకే అతి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సంఖ్యాబలం లభించలేదు. దీంతో ప్రభుత్వ ఏర్పాటులో విజయ్‌తో ఎవరెవరు కలిసొస్తారన్న ప్రశ్న తలెత్తుతోంది. టీవీకేకు కాంగ్రెస్, పీఎంకే, డీఎండీకే, లెఫ్ట్ పార్టీలు మద్దతు ఇవ్వవచ్చని స్థానిక మీడియా కథనాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్, డీఎండీకే, లెఫ్ట్ పార్టీలు డీఎంకే కూటమిలో ఉన్నాయి. ప్రభుత్వ ఏర్పాటులో కలసి రావాలని విజరు తండ్రి చంద్రశేఖర్ కాంగ్రెస్‌ను కోరారు.

**కేరళంలో మొదలైన కుర్చీలాట**

కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయం సాధించిన వెంటనే కుర్చీలాట మొదలైంది. కాంగ్రెస్ సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, వీడీ సతీశన్, రమేష్ చెన్నితల, శశి థరూర్ ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటి వరకూ ఆ పదవికి యూడీఎఫ్ ఎవరి పేరునూ బయటపెట్టలేదు. 'ఎన్నికైన ఎమ్మెల్యేలు తిరువనంతపురం చేరుకొని శాసనసభాపక్ష సమావేశాన్ని నిర్వహిస్తారు. భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చిస్తారు. ఆ తర్వాత యూడీఎఫ్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. ఏదేమైనా నిర్ణయాధికారం కాంగ్రెస్ అధిష్టానానిదే' అని పార్టీ ఎంపీ కె.సురేష్ చెప్పారు. కాగా ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న నేతలు నూతన ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

**తమిళనాడు సీఎం స్టాలిన్ ఓటమి**

తమిళనాడులోని కొలత్తూర్ శాసనసభ స్థానంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పరాజయం పాలయ్యారు. ఆయనపై టీవీకే అభ్యర్థి వీఎస్ బాలు 8,284 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. బాలుకు 76,796 ఓట్ల రాగా స్టాలిన్‌కు 68,512 ఓట్లు మాత్రమే లభించాయి.

# కేరళంలో యుడిఎఫ్ విజయం

(మొదటిపేజీ తరువాయి)

పినరయి విజయన్ (దర్మాదమ్), కె.ఎన్.బాలగోపాల్ (కొత్తరక్కార), సాజి చెరియన్ (చెంగనూర్), మహ్మద్ రియాజ్ (బేపోర్), కె.రాజన్ (ఒళ్ళూర్), జి.ఆర్.అనీల్(నెడుమంగద్), పి.ప్రసాద్(చేర్తాలా)లు తమ స్థానాల్లో గెలుపొందారు.

మరోవైపు, పి.రాజీవ్, ఎం.బి.రాజేష్, వి.శివన్‌కుట్టీ, ఆర్.బిందు, వీణా జార్జ్‌లతో సహా పలువురు మంత్రులు, ప్రముఖులు ఓటమిని చవిచూశారు. ఎల్‌డిఎఫ్ కన్వీనర్ టి.పి.రామకృష్ణన్ కూడా పెరంబ్రాలో విజయం సాధించలేకపోయారు.

ఇక మల్లప్పురం, వాయనాడ్, ఎర్నాకుళం, ఇదుక్కి, కొట్టాయం జిల్లాల్లో యుడిఎఫ్ క్లీన్ స్వీప్ చేసింది. యుడిఎఫ్‌కు అనుకూలంగా బలమైన గాలులు వీస్తున్నా కన్నూర్, త్రిస్సూర్, పాలక్కాడ్ జిల్లాలను వామపక్షాలు నిలబెట్టుకున్నాయి. నేమమ్, కజకాకూట్టమ్, చతనూర్ ఈ మూడు నియోజకవర్గాల్లో బిజెపి విజయం సాధించింది. పార్టీ అధిష్టానం ఆదేశాలనుసరించి కేబినెట్ కూర్పు జరుగుతుందని ప్రతిపక్ష నేత వి.డి.సతీశన్ ప్రకటించారు. ప్రజలిచ్చిన తీర్పును పార్టీ గౌరవిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్ తెలిపారు. ఈ ఓటమి నుండి పాఠాలను నేర్చుకుని ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

**ఊహించని ఫలితాలు ! : సిపిఎం**

ఈ ఎన్నికల్లో సిపిఎం ఓటమి అస్సలు ఊహించనిదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గం పేర్కొంది. ఓటమిని అంగీకరిస్తూ, పార్టీ తన లోపాలను సరిదిద్దుకుంటుందని తెలిపింది. ఎల్‌డిఎఫ్‌కి ఓటు వేసిన ప్రజలందరికీ అభినందనలు తెలియచేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. విజయాలను పరిరక్షించడానికి, ప్రజల డిమాండ్లను సాధించడానికి పార్టీ కట్టుబడి వుంది. కేరళలో సాధారణంగా వరుసగా ప్రభుత్వాలు మారుతూ వుండే ధోరణిని విచ్ఛిన్నం చేస్తూ గత పదేళ్ళుగా ఎల్‌డిఎఫ్ అధికారంలో వుంది. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చగలిగింది. ప్రకృతి వైపరీత్యాలు, కరోనా వంటి మహమ్మారులు సంభవించినపుడు ప్రజలను సమీకరించడం ద్వారా ముందుకు సాగింది. ప్రపంచీకరణ విధానాలను గుడ్డిగా అమలు చేయకుండా దూరంగా వైదొలగడం ద్వారా ఒకప్పుడు చిన్నాభిన్నమైన కేరళను దారిద్ర్య విముక్తి రాష్ట్రంగా మార్చడంలో ఎల్‌డిఎఫ్ విజయం సాధించింది.

అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించాం. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమ పథకాల్లో యావత్ దేశానికి రాష్ట్రం ఒక ఆదర్శంగా నిలిచింది. ఆరోగ్యం, విద్య, గృహ నిర్మాణాలు, పారిశుధ్యం రంగాల్లో చేసిన కృషి జాతీయ ప్రామాణికాలను అందుకుంది. దేశవ్యాప్తంగా మైనారిటీలు, డెమోక్రాట్లపై దాడులు జరుగుతుంటే కేరళ మాత్రం మత సామరస్యతకు నెలవుగా నిలిచింది. నీతి అయోగ్ డేటా ప్రకారం, భారతదేశంలో అత్యుత్తమమైన రాష్ట్రంగా కేరళ ఎదిగింది. మతపరమైన దేశాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో, అలాగే సమాఖ్యవాదాన్ని కాపాడేందుకు జరిగే పోరాటంలో గట్టి వైఖరి తీసుకుంది. ప్రజా నిరసనలతో పాటూ, ఈ పోరాటాలు కోర్టుల్లోనూ కొనసాగాయి. దేశవ్యాప్తంగా ప్రజా రాజకీయాలను బలోపేతం చేశాయి.

ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కొనసాగుతుందని అంచనా వేశాం. విమర్శలు, లోపాలను గుర్తించి, పరిశీలించి, పరిష్కరిస్తాం. మూడు సీట్లను బిజెపి గెలుచుకోగలగడం తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా వుంది. ఆ మూడు స్థానాల్లోనూ బిజెపిపై పోరాడింది ఎల్‌డిఎఫ్ అభ్యర్థులే, చాలా స్వల్పమైన ఓట్ల తేడాతో అక్కడ వారు ఓడిపోయారు. ఈ అన్ని నియోజకవర్గాల్లోనూ, యుడిఎఫ్ మూడో స్థానంలో వుంది. మత సామరస్యతకు మారు పేరైన కేరళలో మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా మరింత బలంగా ముందుకు సాగాల్సిన ఆవశ్యకతను, ప్రాధాన్యతను ఇది గుర్తు చేస్తోందని కార్యదర్శివర్గం ఆ ప్రకటనలో పేర్కొంది.

# ప్రతి జిల్లాలో మెగా ఇండస్ట్రియల్ పార్కు

(మొదటిపేజీ తరువాయి)

విశాఖ ఎకనామిక్ రీజియన్, అమరావతి ఎకనామిక్ రీజియన్, తిరుపతి ఎకనామిక్ రీజియన్ ప్రాంతాల్లో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై నిశితంగా చర్చించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ఏర్పాటు చేయటం ద్వారా రైతులకూ ప్రయోజనం కల్పించాలన్నారు. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పర్యాటకం అనే మూడు విధానాలతో ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రతీ జిల్లాలోనూ ఓ మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున కలుగుతాయన్నారు. ప్రతీ పారిశ్రామిక క్లస్టర్ వద్దా ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా ఏపీ ఎంఎస్ఎంఈల స్థాపనలో అగ్రస్థానంలో ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్లుగా ఎదిగేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రేర్ ఎర్త్ మినరల్ పార్క్ ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ సహా 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేయాలన్నారు. పారిశ్రామిక పార్కుల్లో ప్రాడెక్టు పర్ఫెక్షన్ తో పాటు లాజిస్టిక్స్ ను కూడా అనుసంధానం చేయాలని సూచించారు. నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్ లాంటి మౌలిక సదుపాయాలు ఈ లాజిస్టిక్స్ పార్కులకు అనుసంధానమయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేకించి రవాణా వ్యయం తగ్గితే ప్రయోజనం కలుగుతుందన్నారు.


పారిశ్రామిక క్లస్టర్లకు రైల్, రోడ్, పోర్టు కనెక్టివిటీ జరిగేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సూచనలు చేశారు. ఈ సమీక్షకు పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్, సీఎస్ సాయి ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఎస్.ఎల్.ఎన్ కాలనీలో
# పడకేసిన పారిశుధ్యం
### - పట్టించుకోని పంచాయతీ అధికారులు



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** మండల కేంద్రంలోని ఎస్.ఎల్.ఎన్ కాలనీలో పారిశుధ్యం పడకేసింది. స్థానిక మండల పరిషత్ పాఠశాల ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోవడంతో పాటు, డ్రైనేజీలు పూడిక తీయక మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పొడవునా చెత్త పేరుకుపోయి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో అటుగా వెళ్లే పాదచారులు, పాఠశాల విద్యార్థులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు ప్రబలి, అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. సమస్య గురించి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, పంచాయతీ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, నిలిచిన చెత్తను తొలగించి డ్రైనేజీలను శుభ్రం చేయాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



**కూడేరు - సూర్య వాస్తవం :** కూడేరు మండలం, పి.నారాయణపురం గ్రామ వాస్తవ్యులు ఎం. నారాయణరెడ్డి – లీలావతి దంపతుల కుమారుడు సాయి యశ్వంత్ రెడ్డి, ముదిగుబ్బ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన చింతలరెడ్డి అరుణ – శ్రీనివాస రెడ్డి దంపతుల కుమార్తె కీర్తి రెడ్డిల వివాహ వేడుక అనంతపురంలోని ఎం వై ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వైస్సార్సీపీ ఇంచార్జ్ వై విశ్వేశ్వరరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాడు . వివాహనికి వచ్చిన అతిధులను, వైస్సార్సీపీ నాయకులను, కార్యకకర్తలను ఆప్యాయంగా పలకరిస్తూ అడిగిన అందరితో ఎంతో ఓపిగ్గా చిరునవ్వుతో ఫోటోలు దిగారు. నారాయణరెడ్డి కోరిక మేరకు అందరితో కలసి భోజనం చేశారు.ఈ వివాహ కార్యక్రమానికి వై విశ్వేశ్వరరెడ్డి కుమారుడు యువనాయకుడు వై ప్రణయ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి అందరిని ఆప్యాయంగా పలకరించి భోజనం అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, జడ్పీటీసీ గిరిజమ్మ, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ పాల్గొని వధూవరులను ఆశీర్వాదించారు. అలాగే ఉరవకొండ నియోజకవర్గంతో పాటు కూడేరు, బెలుగుప్ప, విడపనకల్, వజ్రకరూర్ మండలాల నుండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైలాండ్ ఇండస్ట్రీస్ గార్మెంట్స్ యూనిట్ ప్రారంభం



**మడకశిర- సూర్య వాస్తవం :** మడకశిర మండలం నీలకంఠాపురంలో హైలాండ్ ఇండస్ట్రీస్ గార్మెంట్స్ యూనిట్ ప్రారంభం కావడం శుభపరిణామం. రాజకీయ, సినీ రంగ ప్రముఖుల సమక్షంలో వైభవంగా జరిగింది. కర్ణాటక మధుగిరి ఎమ్మెల్యే రాజన్న, మాజీ మంత్రి రఘువీరారెడ్డి పాల్గొన్నారు. విశిష్ట అతిథి కన్నడ పవర్ స్టార్ దివంగత పునీత్ రాజ్‌కుమార్ సతీమణి అశ్విని రాజ్ కుమార్ ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హైలాండ్ సంస్థ ప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ పరిశ్రమ స్థాపన వల్ల కలిగే ప్రయో జనాలు ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు, యువతకు స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. నీలకంఠాపురం, చుట్టుపక్కల గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు పుంజు కుంటాయి. ఉపాధి కోసం ఇతర నగరాలకు వెళ్లే అవసరం తగ్గుతుంది. మాజీ మంత్రి రఘువీరారెడ్డిగా తన సొంత గ్రామంలో ఇటువంటి పరిశ్రమలు వచ్చేలా కృషి చేయడం అభినందనీయం. ఇది ఆ ప్రాంత అభివృద్ధికి బాటలు వేస్తుందని ఆశిద్దాం.

# కేరళలో కాంగ్రెస్ పార్టీ విజయంపై హర్షం

- కేరళలో కాంగ్రెస్ కూటమి గెలుపు ఆ రాష్ట్ర ప్రజల తెలివైన నిర్ణయంగా భావిస్తున్నాం
- ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన నంద్యాల జిల్లా అధ్యక్షులు,, న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి



**డోన్ -సూర్య వాస్తవం:** 5 రాష్ట్రాల సాధారణ ఎన్నికల ఫలితాలలో కేరళలో కాంగ్రెస్ కూటమి యు.డి.ఎఫ్ కు స్పష్టమైన మెజార్టీ రావడంతోనంద్యాల జిల్లా అధ్యక్షులు, న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి కేరళలో ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేసి, దేశ ప్రజల కోసం ప్రాణాలు త్యాగం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తల్లి పాలన అందించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. దేశంలో అక్షరాస్యతలోనూ తెలివితేటలలోను అగ్రగామిగా ఉండే కేరళ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఎన్నుకున్నారన్నారు. త్వరలో ఆంధ్రాలో కూడా అదే పరిస్థితి వస్తుందన్నారు. దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు జాతి, కుల, మతం అనే వర్గవైషమ్యాలు లేకుండా, ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు బలహీన వర్గాలు, అగ్రవర్ణాలలో నిరుపేదలు తదితరుల సంక్షేమం కోసం నిరంతరం పరితపించి గొప్ప గొప్ప చట్టాలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. ఓవైపు ప్రజల సంక్షేమం, మరోవైపు దేశాభివృద్ధి లక్ష్యాలను సాధిస్తూ ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు అనువైన వాతావరణం కల్పించే పరిపాలన ఒక్క కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. దేశంలోని ప్రజలందరూ తెలంగాణ, కేరళ,కర్ణాటక ప్రజల స్ఫూర్తితో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టే అవకాశం ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమం లోనంద్యాల జిల్లా అధ్యక్షులు, న్యాయవాదులు డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి నంద్యాల డిసిసి ఉపాధ్యక్షులు ఉన్ని గొర్ల జనార్దన్, డిసిసి ప్రధాన కార్యదర్శి వడ్డే రాజశేఖర్ పాల్గొన్నారు

# ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల శిక్షణ





**పులివెందుల - సూర్య వాస్తవం:** ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించే దిశగా పులివెందుల వ్యవసాయ డివిజన్ లోని ఐదు మండలాలలో సోమవారం, మంగళవారం రెండు రోజులపాటు రైతు సేవ కేంద్రం సిబ్బందికి మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటిరోజు పులివెందుల మండలంలోని అచ్చవెల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో సాగుచేసిన వివిధ రకాల పంటలను పిఎండిఎస్ విధానం ద్వారా సాగుచేసిన పంటలను పరిశీలించడం జరిగింది. ఇందులో భాగంగా ఖరీఫ్ సీజన్ మొదలయ్యే ముందస్తుగా ప్రకృతి వ్యవసాయం ద్వారా అరటి ,బత్తాయి మరియు వివిధ పంటలలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే దిశగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులను చైతన్య పరిచే దిశగా సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాల ద్వారా విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో ముఖ్యంగా ద్రవ జీవామృతం, ఘన జీవామృతము, పిఎండిఎస్ అదేవిధంగా 5 అంతస్తుల నమూనా ,అదేవిధంగా ప్రీ మాన్సూన్ డ్రైసోయింగ్ పద్ధతిలో నవధాన్యాలను విత్తన గుళికలుగా చేసి ఖాళీ భూమిలో విత్తనం చల్లడం ద్వారా నిస్సారంగా తయారైన భూములను సారవంతంగా తయారు చేసే విధానానికి రైతులలో అవగాహన కల్పిస్తూ రానున్న కాలంలో ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని ఈ విధానం ద్వారా రైతులకు అధిక దిగుబడి సాధించే ఆచరణ పద్ధతులను రైతులకు తెలియజేసి ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ముందుకు ప్రోత్సహించాలని సిబ్బందిని ఉద్దేశించి సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి మరియు మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి సూచించారు ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ యామిని లత మరియు రైతు సేవ కేంద్రాల సిబ్బంది ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచండి
### - వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి

**పులివెందుల- సూర్య వాస్తవం :** మినీ సచివాలయంలోని వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో సోమ వారం పులివెందుల మండలంలోని ఎరువులు ,విత్తనాలు మరియు పురుగుమందుల దుకాణదారులతో స్థానిక మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులకు కొరత లేకుండా సరఫరా చేయాలని డీలర్లను ఉద్దేశించి తెలిపారు అదే విధంగా ఎరువుల దుకాణదారులు రైతులకు సరఫరా చేసే ఎరువులను బయోమెట్రిక్ విధానం ద్వారా ఈ పాస్ మిషన్ ద్వారా సరఫరా చేయాలని సంబంధిత రిజిస్టర్లు ,రికార్డులు ఎప్పటికప్పుడు సంబంధిత వివరాలు నమోదు చేయాలని ప్రభుత్వం కేటాయించిన ఎమ్మార్పీ ధరలకు మాత్రమే ఎరువులను విక్రయించాలని ఆయన తెలిపారు పులివెందుల వ్యవసాయ డివిజన్ వ్యాప్తంగా సుమారు 500 మెట్రిక్ టన్నులు యూరియా, 600 మెట్రిక్ టన్నులు ఇతర ఎరువులు అందు బాటులో ఉన్నాయని రైతులకు అవసరమైన సమయంలో సరఫరా చేయాలని ఆయన డీలర్లను ఉద్దేశించి తెలిపారు. అదేవిధంగా రూల్స్ అతిక్రమించిన దుకాణదారుల పైన చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్ కుమార్ రెడ్డి, పులివెందుల మండలంలోని ఎరువుల, విత్తనాలు, పురుగు మందుల దుకాణదారులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న గురుకుల సిబ్బంది

### - ఉపాధ్యాయురాలు సుభాన్ బీ కుటుంబానికి రూ. 1.30 లక్షల విరాళం
### - పిల్లల చదువుకు ఎమ్మెల్సీ హామీ

**పులివెందుల - సూర్య వాస్తవం :** అకాల మరణం చెందిన ఇపట్ల గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు సుభాన్ బీ కుటుంబానికి తోటి సిబ్బంది తమ ఉదారతను చాటుకున్నారు. ఆమె ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తు కోసం పాఠశాల సిబ్బంది సేకరించిన రూ. 1,30,000 ఆర్థిక సాయాన్ని సోమవారం పులివెందులలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఇపట్ల గురుకుల పాఠశాలలో పార్ట్ టైమ్ టీజీటీ (సైన్స్) టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న సుభాన్ బీ ఇటీవల అకాల మరణం చెందారు. ఆమె మృతితో నిరుపేద కుటుంబం విచారంలో మునిగిపోగా, తోటి ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా స్పందించి ఈ నగదును సేకరించారు.


**పిల్లల చదువుకు ఎమ్మెల్సీ హామీ**

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తోటి ఉద్యోగిని కుటుంబానికి అండగా నిలిచిన గురుకుల సిబ్బందిని అభినందించారు. సుభాన్ బీ ఇద్దరు ఆడపిల్లల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయ కులు గురు రత్నం, అమరనాథ్ రెడ్డి, నాగేంద్ర, ఆదినారాయణ రెడ్డి, ప్రవీణ్ కుమార్, తిరుపాల్, ఉత్తయ్య, లక్ష్మి, గిరిజా కుమారి, కుర్షద్, సుబ్బారెడ్డి, బాలయ్య, రాజు మరియు గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



# కణేకల్ మేజర్ పంచాయతీకి ఐఎస్ఓ గుర్తింపు

- జిల్లాలోనే తొలి ఘనత, ఆదర్శంగా నిలిచిన పంచాయతీ
- ఒక గంట లోపల మ్యారేజ్ సర్టిఫికెట్ జారీ చేసిన ఏకైక పంచాయతీ



**కణేకల్– సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో మొట్టమొదటిసారిగా ఐఎస్ఓ సర్టిఫికేషన్ పొందిన పంచాయతీగా కణేకల్ మేజర్ పంచాయతీ చరిత్ర సృష్టించింది. కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన ఆడిట్ బృందం సోమవారం నిర్వహించిన సమగ్ర పరిశీలన అనంతరం ఈ విషయాన్ని విలేకరుల సమావేశంలో అధికారికంగా ప్రకటించింది. పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఆడిట్ ప్రక్రియలో పరిపాలన, పారదర్శకత, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందించే సేవల నాణ్యత, శుభ్రత, పర్యావరణ పరిరక్షణ వంటి పలు అంశాలను సమగ్రంగా పరిశీలించినట్లు ఆడిటర్ ప్రేమనందు తెలిపారు. అన్ని విభాగాల్లోనూ నిబంధనలకు అనుగుణంగా పనితీరు ఉండటం, సకాలంలో సేవలందించడం, ఫిర్యాదుల పరిష్కారంలో చురుకుదనం వంటి అంశాలు ప్రత్యేకంగా గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి నాయ కత్వంలో పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఈ విజయాన్ని సాధించారని మరియు గంట లోపల మ్యారేజ్ సర్టిఫికెట్ జారీ చేసిన ఏకైక పంచాయతీ అని ఆడిట్ బృందం ప్రశంసించింది. ముఖ్యంగా డిజిటల్ రికార్డుల నిర్వహణ, పౌర సేవల సులభతరం, పారదర్శక విధానాలు, కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణ వంటి అంశాలు ఐఎస్ఓ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి మాట్లాడుతూ, "కణేకల్ పంచాయతీకి ఐఎస్ఓ



గుర్తింపు రావడం మా బృందానికి గర్వకారణం. ఎంపీడీవో జయసింహారెడ్డి గారి ప్రోత్సాహం, సిబ్బంది కృషి, ప్రజల సహకారం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగాం" అని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పథకాల అమలులో కణేకల్ పంచాయతీ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ గుర్తింపు గ్రామ అభివృద్ధికి మరింత ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మారుతి ప్రసాద్, బిల్ కలెక్టర్లు తిరుపాల్, వరదరాజులు, ఇబ్రహీం అలీ, కంప్యూటర్ ఆపరేటర్లు వినోద్, మల్లికార్జున, ఇతర పంచాయతీ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సిబ్బందిని అభినందించారు. ఈ ఐఎస్ఓ గుర్తింపుతో కణేకల్ మేజర్ పంచాయతీ జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా ఆదర్శ పంచాయతీగా నిలిచే దిశగా ముందడుగు వేసిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మూడు రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమి ఘనవిజయం...

- రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు...
- దేశ ప్రజలు బిజెపి వైపే.. కాపు రామచంద్రారెడ్డి
- రాబోయే 15 సంవత్సరాలు కేంద్రంలో ఎన్డీఏదే అధికారం..

**రాయదుర్గం – సూర్య వాస్తవం :** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు భారతీయ జనతా పార్టీ ఎన్డీఏ కూటమి వైపు మూడు రాష్ట్రాల ప్రజలు ఎన్డీఏ కూటమికి పట్టం కట్టడంతో రాయదుర్గం పట్టణంలోని వినాయక సర్కిల్లో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఓబిసి మార్చ్ ఇంచార్జ్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో విజయోస్తు సంబ రాలు బిజెపి కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు రాష్ట్ర ఓబిసి మార్చి ఇన్‌ఛార్జి కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ... దేశ ప్రజలు ఎన్డీఏ కూటమి వైపే ఉన్నారనే నిజం మరొక్కసారి రుజువు అయిందని, వెస్ట్ బెంగాల్, పుదుచ్చేరి, అస్సాం రాష్ట్రాలలో




ఎన్డీఏ గణ విజయం సాధించడం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలనకు దేశ ప్రజలు పట్టం కట్టారని కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. రాబోయే 15 సంవత్సరాలు ఎన్డీఏ కూటమి కేంద్రంలో అధికారం చేపట్టడం ఖాయమని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బిజెపి నాయకులు కార్యకర్తలతో కలిసి భారీగా బాణసంచారలు పేర్చి, విజ యోత్సవ సంబరాలను చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ జీవీ నాయుడు ( నాని) మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ మాజీ కౌన్సిలర్లు గోవిందు వన్నూరప్ప శ్రీనివాస్ రెడ్డి షబ్బీర్, మాజీ డిరాల్ మండల కన్వీనర్ బోయ ఓనర్ స్వామి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి కళ్లెం సురేష్ మాజీ సర్పంచ్ నాగరాజు డాక్టర్ మల్లికార్జున జకాతి కృష్ణ చదం తిప్పే స్వామి వాల్మీకి పవన్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు






## డాక్టర్ రవీంద్ర రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

**పులివెందుల – సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర రెడ్డి కి రామతులశమ్మ ఆసుపత్రి నందు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి దృశ్యాలువాతో ఘనంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు సత్కరించారు. ఈ సందర్భంగా స్నేహమృత రాజు మాట్లాడుతూ డాక్టర్ రవీంద్రారెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భగవంతుని ప్రార్థించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సురేష్, రాఘవేంద్ర రెడ్డి, రాజు, చాంద్ బాషా తదితరులు.

## ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డికి పార్ట్ టైం ఉపాధ్యాయుల విన్నపం




**పులివెందుల – సూర్య వాస్తవం :** సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పులి వెందులలోని ఎమ్మెల్సీ నివాసంలో భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయులు తమ వినతిపత్రంలో ప్రధానంగా ఉద్యోగ భద్రత ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న పార్ట్ టైం టీచర్లకు తగిన ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రతి నెలా జాప్యం లేకుండా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ఎలాంటి ఆలస్యం లేకుండా రెన్యువల్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో ఎదుర్కొంటున్న ఇతర మౌలిక, వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వ అధికారులతో చర్చించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ స్పందిస్తూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గురు రత్నం, అమరనాథ్ రెడ్డి, నాగేంద్ర, ఆదినారాయణ రెడ్డి, ప్రవీణ్ కుమార్, తిరుపాల్, ఉత్తయ్య, లక్ష్మి, గిరిజా కుమారి, కుర్షద్, సుబ్బారెడ్డి, బాలయ్య, రాజు మరియు ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** కౌకుంట్ల ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. సోమవారం అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి మంత్రి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు సమర్పించిన అర్జీలపై తక్షణమే స్పందించి, ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు చేరువగా ఉంటూ, సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరంతరాయంగా పీజీఎస్ఆర్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఎక్కడా జాప్యం లేకుండా పను లు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో ప్రజలు, బాధితులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

## భారీగా పెరిగిన వరి గడ్డి ధరలు

- పాడి రైతుల ఆవేదన



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** ఉరవకొండ ప్రాంతంలో వరి గడ్డి ధరలు భారీగా పెరగడం పట్ల పాడి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు నిజంగా ఆందోళనకరం. పాడి పరిశ్రమలో కీలకమైన పశుగ్రాసం కొరతతో పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ కారణాలతో వరి పంట కోసేందుకు యంత్రాలు ఉపయోగిస్తు న్నారు. ఇందులో కూలీల కొరత ఒక కారణమైతే, ఖర్చులు పెరగ డంతో సాగుదారులు యంత్రాలపై ఆధారపడడం ఏటా పెరుగుతోంది. దీంతో స్థానికంగా పశుగ్రాసం కొరత ఏర్పడింది. వ్యాపారులు కణేకల్లు, బొమ్మనహాల్ మండలాల నుంచి వరి గడ్డిని కొనుగోలు చేసి ఉరవకొండలో అమ్ముతుంటారు. క్షేత్రస్థాయిలో గ్రాసం కొరత ఏర్పడ డంతో వరిగడ్డి ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. ట్రాక్టర్ గడ్డి ధర రూ.10వేల వరకు పలుకుతోంది. ఐదు నెలల క్రితం రూ.6వేలు వరకు పలికిన ధర ఇప్పుడు ఏకంగా రూ.10వేలు అయింది. ధర అమాంతంగా పెరగడంతో పశుపోషణ భారంగా మారిందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. పాల దిగుబడి ద్వారా వచ్చే ఆదాయం కంటే, పశువుల గ్రాసానికి అయ్యే ఖర్చే అధికమవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే పాడి పరిశ్రమను నడపడం కష్టతరంగా మారుతుంది. రైతులు ఆవేదన వ్యాఖం చేశారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

- ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా రైతులకు శిక్షణ



**సింహాద్రిపురం – సూర్య వాస్తవం:** మండలంలోని గురజాల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ అంశాలపై ఎల్-నినో ప్రభావంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతు సేవా కేంద్రం సిబ్బందికి,ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. సోమవారం జరిగిన మొదటి రోజు శిక్షణలో వ్యవసాయ అధికారులు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎ.రామాంజుల రెడ్డి మాట్లాడుతూ ఎల్-నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. కాబట్టి రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా తక్కువ నీటితో సాగయ్యే జొన్న, ఆముదం, కంది వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు. ముఖ్యంగా ఏ.టి.ఎం (ఎనీ టైం మనీ) పి.ఎం.డి.ఎస్ నమూనాల ద్వారా మెరుగైన ఫలితాలు ఎలా సాధించవచ్చో సిబ్బందికి వివరించారు. ఈ కార్య క్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.రామాంజుల రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా ముగిసిన బండిసుల తిరునాళ్ల



**పెద్దవడుగూరు- సూర్య వాస్తవం :** పెద్దవడుగూరు మండలం గుత్తిఅనంతపురం గ్రామ పరిధిలో గత కొన్ని రోజులుగా అత్యంత వేడుకగా జరుగుతున్న బండిసుల తిరునాళ్ల భక్తుల హర్షధ్వానాల మధ్య అత్యంత వైభవంగా ముగిసింది. ఉదయం నుండే స్థానిక, చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో దేవతామూర్తులకు విశేష అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన బండిసుల పూలమాలల అలంకరణతో గుత్తిఅనంతపురం మరియు చుట్టూప్రక్కల గ్రామాల ప్రజలు ఎంతో అందంగా ముస్తాబు చేసిన ఎద్దులతో భక్తుల జయజయధ్వానాల మధ్య బండిసుల ఊరేగింపు సాగింది. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన దేవాలయం మేళతాళాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్న చిన్న ఘటనలు మినహాయించి ?ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ వేడుకను విజయవంతం చేశారు.

# వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్కానింగ్ సెంటర్ల తనిఖీ

**- లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠినమైన చర్యలు**



**పులివెందుల- సూర్య వాస్తవం :** వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజ్ ఆదేశాల మేరకు పులివెందులలో స్కానింగ్ సెంటర్లో హాస్పిటల్ తనిఖీలు నిర్వహించారు. కడప జిల్లా పరిధిలోని పులివెందుల డివిజన్ లో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజ్ ఆదేశాల మేరకు డిప్యూటీ డి యమ్ ఎచ్ ఓ, ఖజా మోద్దీన్ మరియు డిప్యూటీ డెమో ప్రసన్నలత బాలాజీ నర్సింగ్ హోమ్ మరియు వరసిద్ద వినాయక స్కాన్ సెంటర్లను ఆకస్మిక తనికి చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యానికి తగు సూచనలు చేస్తూ మిషన్స్ వద్ద బయట తప్పనిసరిగా ఐ ఈ సి డిస్ప్లే ఉంచాలని, బయట అందరికీ కనిపించేలాగా ప్రైస్ లిస్ట్ పెట్టాలని, ఎవరికైనా గర్భస్థ లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే సదరు స్కాన్ సెంటర్ ని ప్రభుత్వాన్ని నిబంధనలు ప్రకారం సీజ్ చేస్తామని, స్కానింగ్ సెంటర్స్ ప్రాంగణం లో సీసీటీవీ తప్పనిసరిగా ఉండాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

# టీటీడీ ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం :** తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న ప్రాణదాన ట్రస్ట్ కు ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన బాలభద్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వాహకులు సోమవారం 10 లక్షల రూపాయలను శ్రీ వెంకటేశ్వరస్వామికి విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఈ కంపెనీ ప్రతినిధి రాఘవేంద్ర తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి విరాళాన్ని డీడీ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ తాను కొన్ని సంవత్సరాలుగా కలియుగ శ్రీ వెంకటేశ్వర స్వామి సేవలో కొనసాగుతున్నానని పేర్కొన్నారు. తాను ప్రతినిత్యం వెంకటేశ్వర స్వామిని తరిస్తూ ఉంటానని పేర్కొన్నారు. అఖిలాండ బ్రహ్మాండ కోటి శ్రీ వెంకటేశ్వర స్వామి సేవలో ఎప్పటికీ ఉంటూ తన వంతు విరాళాలను దాతల నుంచి సేకరిస్తూ శ్రీవారి పాదాల చెంతన సేవ చేసుకుంటూ ఉంటానని రాఘవేంద్ర పేర్కొన్నారు. నా ఊపిరి ఉన్నన్నాళ్లు తాను శ్రీ వేంకటేశ్వర స్వామి సేవలో కొనసాగుతానని వివరించారు.



# కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం హర్షనీయం

**-డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం :** కేరళ రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో 10 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధికారంలోకి రావడం హర్షనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ నాయకులు కేరళం ఎన్నికల ఫలితాలపై సంతోషం వ్యక్తం చేస్తూ కార్యకర్తలకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ కేరళం ప్రజలు మార్పు కోరుకున్నారని ఈ నేపథ్యంలో కేరళం లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది అన్నారు అదేవిధంగా కేంద్రంలో కూడా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని,ఇప్పటికే మూడు పర్యాయాలు మోడీ నాయకత్వంలో బిజెపి అధికారంలో ఉందని,వచ్చే ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకుంటారని,బిజెపి ప్రభుత్వాన్ని మార్చి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తారని ఆశాభావం తులసిరెడ్డి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గపు సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బందారు వెంకటేశు,నామా వినయ్, వేమారాజ,ఐచర్ రమణ వేమయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ఏసి కమిషనర్‌గా సందీప్ కుమార్

**కదిరి - సూర్య వాస్తవం :** కదిరి మున్సిపల్ ఎఫ్ఏసి కమిషనర్‌గా కదిరి మున్సిపాలిటీలో ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న సందీప్ కుమార్‌ను నియ మిస్తూ సంబంధిత శాఖ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన కిరణ్ కుమార్ ను మాతృ శాఖకు వెళ్లాల్సిందిగా ఆ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.



అయితే పరిపాలనాపరంగా కదిరి మున్సిపాలిటీలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎఫ్ఏసి కమిషనర్‌గా ఏఈ సందీప్ కుమార్ ను నియమిస్తూ సంబంధిత శాఖ ఉన్నతాధికారులు జారీ చేశారు. సందీప్ కుమార్ మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టడంతో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సందర్భంగా సందీప్ మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా త్రాగునీరు, శానిటేషన్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకూడదని ఒకవేళ వార్డుల్లో సమస్యలు ఉంటే నేరుగా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

# వాహన దారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలి

**- ఎస్ఐ తాయారు హుస్సేన్**



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలని ఎస్ఐ తయారు హుస్సేన్ తెలిపారు. సీఐ టి.నరసింహులు ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించారు. అనంతరం ఎస్ఐ తహర్ హుస్సేన్ వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. వాహనాల రికార్డులు తప్పనిసరిగా ఉంచుకోవాలని అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్ లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. వీటి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సందర్భాల్లో వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అనాధ వృద్ధులకు అన్నదానం

**వేంపల్లె - సూర్య వాస్తవం :** స్థానిక పట్టణంలోని మదర్ తేరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జనసేన పార్టీ చక్రాయపేట మండల నాయకులు పట్టం ఉదయ్ వెల్లడించారు.



రాసినేని కృష్ణమూర్తి ఐదో వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదానం, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టెం ఉదయ్ మాట్లాడుతూ తన తాత కృష్ణమూర్తి ఐదో వర్ధంతిని పురస్కరించు కొని ఆశ్రమంలోని అనాథ వృద్ధుల అన్నదాన కార్యక్రమం చేపట్టామన్నారు. అలాగే సమాజంలో ఉన్న నిస్సహాయకులకు తోడ్పాటు అందించేందుకు ప్రతి ఒక్కరు దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో వంశి, వెంకటఅభినయ్, గౌతమ్, చైతన్య, గోపీచంద్, జయవర్ధన్,మన్విత తదితరులు పాల్గొన్నారు.

# మూగ జీవాల కోసం ముందుకొచ్చిన సేనాని

**- ఇటువంటి నాయకుడు మళ్ళీ పుట్టడు అంటున్న జనసేన నాయకులు**



**వేంపల్లె - సూర్య వాస్తవం :** జనసేన పార్టీ పులివెందుల ఇంచార్జ్ డాక్టర్ హరీష్ నేతృత్వంలో జనసేన నాయకులు గోసల ఆంజనేయులు మాట్లాడుతూ, మూగజీవాలకు ఓటు లేకపోవచ్చు కానీ,వాటికి ప్రాణాలు ఉంటాయి. వాటికి దాహం ఉంటుంది,అంటూ ముందుకు వచ్చిన నాయకుడు మన పవన్ కళ్యాణ్ అని కొనియాడారు.ఇలాంటి నాయకుడు మళ్ళీ పుట్టడు అంటూ జనసేన నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. తదనంతరం మాట్లాడుతూ మూగజీవాల రోదన విన్నాడు నేనున్నాను అంటూ,వాటి దాహార్తిని తీరుస్తున్నాడు. మనసు,మానవత్వం ఉన్న మగమహారాజు అనిపించుకుంటున్నాడు. మూగజీవాలు కూడా జివులే వాటి దాహార్తిని తీర్చేలా భూగర్భ జలాలు అడుగంటి పోయి వేసవి తాపంతో మూగజీవాలు అలమటించకూడదని దృఢ సంకల్పంతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 13500 నీటితోట్లను ఏర్పాటు చేసి మూగజీవాలకు దేవుడయ్యారు మన జనసేనాని పవన్ కళ్యాణ్ అని జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుధీర్ రెడ్డి,దేవ, శ్యామ్,ముక్తార్, ఇదుపులపాయ జయచంద్ర, థామస్, అంజి తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రభంజనం

**- ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఫలితాలు**

**- విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేసిన జనసేన నాయకులు**

**వేంపల్లె - సూర్య వాస్తవం :** ఇది కదా అసలైన ప్రభంజనం. జనసేన నాయకులు గోసల ఆంజనేయులు మాట్లాడుతూ, పది ఫలితాలలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఫలితాలు సాధించడం చాలా సంతోషకరమైన విషయము.



డి.చిన్నారి 596, నిహారిక 596,దివ్య తేజస్వి 596, కొల్లాపూర్ సాయి శ్రీ 596, దిక్షితసాయి 595, నంద్యాల కార్తిక 595, హర్షిని (తుని) 595, వైష్ణవి 595,కోలా లక్ష్మీ వెంకటేశ్వర (సురభి నాగులగుట్టపల్లె) 595, సత్య దుర్గ 595,యార్షిని 595, హాసిని 595 ఇవన్నీ ప్రైవేట్ స్కూల్ మార్కులు కాదు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల మార్కులు. నారా లోకేష్ ఊహాత్మకంగా తీసుకున్న 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఫలించింది. ప్రభుత్వ పాఠశాలలు పది ఫలితాలలో దుమ్ము దులిపింది.సాధారణ ఉత్తీర్ణత శాతం 81. 25% నుంచి 85. 25% కు పెరిగింది. అమ్మాయిల ఉత్తీర్ణత శాతం 5.22% పెరిగింది.కార్పొరేట్ పాఠ శాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల పిల్లలు రాటు తేలేలా చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు జనసేన నాయకులు గోసల ఆంజనేయులు ధన్యవాదాలు తెలియజేశారు.

## చిరంజీవి 'విశ్వంభర'..

# త్రిష బర్త్ డే స్పెషల్ గా ఫస్ట్ లుక్ రిలీజ్




**- విశ్వంభర నుంచి త్రిష ఫస్ట్ లుక్ విడుదల**
**- పుట్టినరోజు కానుకగా పోస్టర్ రిలీజ్ చేసిన చిత్ర యూనిట్**
**- ఈ చిత్రంలో 'అవని' అనే పాత్రలో నటిస్తున్న త్రిష**

మెగాస్టార్ చిరంజీవి హీరోగా, 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా నుంచి మేకర్స్ సోమవారం ఓ కీలక అప్డేట్ ఇచ్చారు. నేడు నటి త్రిష పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలో ఆమె పోషిస్తున్న 'అవని' పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఈ పోస్టర్‌ను పంచుకుంది. "అందమైన త్రిషకు పుట్టినరోజు శుభాకాంక్షలు.

'అవని'గా ఆమె నటన ఎంతో ఆకర్షణీయంగా, అద్భుతంగా ఉండబోతోంది" అని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలిపింది. ఈ పోస్టర్‌లో త్రిష సంప్రదాయ దుస్తుల్లో చాలా హుందాగా కనిపిస్తున్నారు. ఈ చిత్రం భారీ వీఎఫ్ఎక్స్ హంగులతో రూపొందుతోన్న విషయం తెలిసిందే. సినిమా సెకండాఫ్ మొత్తం గ్రాఫిక్స్‌పైనే ఆధారపడి ఉంటుందని, అందుకే నిర్మాణానికి సమయం పడుతోందని గతంలో చిరంజీవి స్వయంగా తెలిపారు. ఇది పిల్లలను, పెద్దలలోని పసివారిని ఆకట్టుకునే చక్కటి చందమామ కథలా ఉంటుందని ఆయన వివరించారు.

యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో ఎక్కడా రాజీ పడకుండా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా, ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.



# ఓటీటీ తెరపైకి
# ప్రదీప్ రంగనాథన్ మూవీ!

**- ప్రదీప్ రంగనాథన్ నుంచి 'ఎల్ ఐ కె'- 100 కోట్ల బడ్జెట్ తో రూపొందిన సినిమా**
**- కోట్ల దగ్గరే ఆగిపోయిన వసూళ్లు - ఈ నెల 6వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్‌లో**

ప్రదీప్ రంగనాథన్ కి యూత్ లో మంచి క్రేజ్ ఉంది. ఆయన నుంచి ఒక సినిమా వస్తోందంటే, యూత్ ఆసక్తితో ఎదురుచూస్తూ ఉంటుంది. అందువలన యూత్ ను దృష్టిలో పెట్టుకునే ఆయన తన సినిమాలను ప్లాన్ చేసుకుంటూ ఉంటాడు. ఆయన నుంచి వచ్చిన తాజా చిత్రమే 'లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. విఘ్నేశ్ శివన్ తన సొంత బ్యానర్ పై తెరకెక్కించిన సినిమా ఇది. కృతి శెట్టి కథానాయికగా అలరించిన ఈ సినిమాను, ఏప్రిల్ 10వ తేదీన థియేటర్లలో విడుదల చేశారు. గతంలో ప్రదీప్ చేసిన సినిమాలన్నీ చాలా తేలికగా 100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టాయి. దాంతో ఈ సినిమా కూడా ఒక రేంజ్ లో వసూళ్లను కొల్లగొడుతుందని భావించారు. ఆ నమ్మకంతోనే 100 కోట్ల వరకూ ఖర్చు పెట్టారు. అయితే ఈ సినిమా 60 కోట్ల దగ్గరే తన జోరును తగ్గించింది. 100 కోట్ల మార్క్ ను టచ్ చేయలేకపోయింది. అలాంటి ఈ సినిమా ఈ నెల 6వ తేదీ నుంచి ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రానుంది. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన 'అమెజాన్ ప్రైమ్' నుంచి వచ్చేసింది. ఇది లవ్ స్టోరీనే .. కాకపోతే ఇప్పటి కాలానికి చెందిన ప్రేమకథ కాదు. 2040లో ప్రేమలు ఎలా ఉండబోతున్నాయి? అనే విషయాన్ని చూపించే ప్రయత్నం చేశారు. అప్పటి యూత్ ధోరణి ఎలా ఉంటుంది? వాళ్ల ఆలోచన విధానం ఎలా ఉంటుంది? అనేవి వినోదభరితంగా చూపించే ప్రయత్నం చేశారు. సైంటిఫిక్ రొమాంటిక్ లవ్ స్టోరీగా రూపొందిన ఈ సినిమా, ఓటీటీ వైపు నుంచి ఎన్ని మార్కులు తెచ్చుకుంటుందనేది చూడాలి.



## రోహిత్, రికెల్టన్ విధ్వంసం..

# భారీ లక్ష్యాన్ని ఊదేసిన ముంబై

**- వాంఖెడేలో లక్నోపై 6 వికెట్ల తేడాతో ముంబై గెలుపు**
**- 229 పరుగుల భారీ లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించిన ముంబై**
**- ఓపెనర్లు రోహిత్ (84), రికెల్టన్ (83) అర్ధశతకాలతో విధ్వంసం**
**- లక్నో తరఫున నికోలస్ పూరన్ 21 బంతుల్లోనే 63 పరుగులతో మెరుపులు**
**- మరో 8 బంతులు మిగిలి ఉండగానే ముంబై విజయం**





ఐపీఎల్ 2026లో భాగంగా వాంఖెడే స్టేడియంలో జరిగిన భారీ స్కోర్ల మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ ఘనవిజయం సాధించింది. లక్నో సూపర్ జెయింట్స్ నిర్దేశించిన 229 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 8 బంతులు మిగిలి ఉండగానే 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ (32 బంతుల్లో 83), రోహిత్ శర్మ (44 బంతుల్లో 84) వీరవిహారం చేసి ముంబై విజయాన్ని సులభతరం చేశారు.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ముంబై ఇండియన్స్‌కు లక్నో బ్యాటర్లు చుక్కలు చూపించారు. ముఖ్యంగా నికోలస్ పూరన్ (21 బంతుల్లో 63; 1 ఫోర్, 8 సిక్సర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతనికి మిచెల్ మార్ష్ (44), హిమ్మత్ సింగ్ (40 నాటౌట్) తోడవడంతో లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోరు చేసింది. ముంబై బౌలర్లలో కార్బిన్ బాష్ రెండు వికెట్లు తీశాడు.

భారీ లక్ష్య ఛేదనలో ముంబైకి ఓపెనర్లు రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 10.5 ఓవర్లలోనే 143 పరుగులు జోడించి మ్యాచ్‌ను లక్నో చేతుల్లోంచి లాగేశారు. ముఖ్యంగా రికెల్టన్ 8 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ ఔటయ్యాక తిలక్ వర్మ (11), సూర్యకుమార్ యాదవ్ (12) త్వరగానే పెవిలియన్ చేరినా, నమన్ ధీర్ (23 నాటౌట్), విల్ జాక్స్ (10 నాటౌట్) మిగిలిన పని పూర్తి చేసి ముంబైకి అద్భుత విజయాన్ని అందించారు.

## టోర్నీ ప్రైజ్ మనీ పెంపునకు ఆటగాళ్ల డిమాండ్

### సీడెడ్ ఆటగాళ్ల సంతకాలతో నిర్వాహకులకు లేఖ




**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ ప్రైజ్ మనీ పెంపు చేయాలని ఆటగాళ్లు డిమాండ్ చేస్తున్నారు. టోర్నీ ఆదాయం న్యాయబద్ధంగా పంపిణీ చేయాలని, బహుమతి సొమ్మును తగినంతగా పెంచకపోవడం, సంక్షేమ సమస్యలపై గ్రాండ్ స్లామ్ టోర్నీ సమాన ప్రాతిపదికన పెంపుదల చేయాలని కోరారు.

ఈమేరకు టాప్ సీడ్ ఆటగాళ్లు జెన్నిక్ సిన్నర్, అర్యానా సబలెంకా సహా అగ్రశ్రేణి క్రీడాకారులు ప్రైజ్ మనీపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సోమవారం రోలాండ్ గారోస్ నిర్వాహకులకు లేఖ రాశారు.

గత ఏడాది కూడా దాదాపు అగ్రశ్రేణి ఆటగాళ్లంతా ఈ ప్రతిపాదన చేసినా.. నిర్వాహకులు వారి అభ్యర్థనను త్రోసి పుచ్చారు. పదవీ విరమణ, ప్రసూతి ప్రయోజనాలు, సంక్షేమ నిధికి చెల్లింపులు, ఇతరత్రా డిమాండ్లతో నాలుగు గ్రాండ్ స్లామ్ నిర్వాహకులకు రెండు లేఖలపై సంతకాలతో తమ అభ్యర్థనను వ్యక్తం చేయగా.. మిగిలిన మూడు గ్రాండ్ స్లామ్ టోర్నీ నిర్వాహకులు ఇప్పటికే ప్రైజ్ మనీని పెంపుదల చేశారు. ఆటగాళ్లకు అందజేసే వాటా గ్రాండ్ స్లామ్ నిర్వాహకులకు వచ్చే వాటాలో 22 శాతంగా ఉండాలని ఆటగాళ్లు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. రోలాండ్ గారోస్ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో ఏప్రిల్ 16న ప్రైజ్ మనీని 9.5 శాతం పెంపు చేయగా... అది సరిపోదని ఆటగాళ్లు డిమాండ్ చేస్తూ మరో లేఖ రాశారు.

# కస్తూర్బాల్లో
# బలవంతపు బదిలీలను బహిష్కరిస్తున్నాం

- ఎస్టీయూ ప్రకటన - సైన్స్ సెంటర్ వద్ద ధర్నా
- డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని స్పష్టీకరణ



**అనంతపురం – సూర్య వాస్తవం:** ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలు లేకుండా కేజీబీవీ ఉద్యోగులకు బదిలీలు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామంజులు యాదవ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు ప్రకటించారు. అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో నిబంధనలకు విరుద్ధంగా కేజీబీవీ ఉద్యోగులకు నిర్వహిస్తున్న బదిలీ కౌన్సిలింగ్ ను సోమ వారం అడ్డుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా, సరైన మార్గదర్శకాలు లేకుండా కేజీబీవీ ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. ఐదేళ్లు, ఎనిమిదేళ్లు పూర్తి అయిన ప్రిన్సిపాళ్లు, సీఆర్పీలను లాంగ్ స్టాండింగ్ పేరుతో తప్పనిసరి బదిలీ కావాల్సిందేనని ఏపీఎస్ శైలజ హుకుం జారీ చేస్తూ, బలవంతంగా సంతకాలు ఎలా చేయించుకుంటారని ప్రశ్నించారు. ఇది సరైన పద్ధతి కాదని ధ్వజమెత్తారు. ఇలా మౌఖిక ఆదేశాలతో అనధికారికంగా బదిలీలు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒకవైపు చాలీచాలని జీతాలతో, ఉద్యోగ భద్రత లేక కొట్టుమిట్టాడుతున్న కేజీబీవీ ఉద్యోగులను బెదిరింపు ధోరణిలో బలవంతపు బదిలీలు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నా దశాబ్ద కాలంగా కేజీబీవీ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం లేదని మండిపడ్డారు. పేద, బడుగు బలహీన వర్గాల పిల్లల విద్యాభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్నా వారికి ఉద్యోగ భద్రత కల్పించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. మినిమం టైం స్కేల్ వర్తింపజేసి, ఉద్యోగ భద్రత కల్పించిన అనంతరం ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేసి బదిలీలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ ఫణి భూషణ్, మహేశ్వర్ రెడ్డి, గంగాధర్, ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 10వ తరగతి ఫలితాల్లో
# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

- అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అభినందించారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, వారి కృషి, పట్టుదల, క్రమశిక్షణనే ఈ విజయానికి కారణమని ప్రశంసించారు. జిల్లాలో ఈసారి



సాధించిన 10వ తరగతి ఫలితాలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత్వం, నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయని అన్నారు. ఇంటర్మీడియట్‌లో తమ ఆసక్తి, లక్ష్యాలకు అనుగుణంగా సబ్జెక్టులను ఎంపిక చేసుకుని, స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అభినందించారు.

**అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు:**

- ఆర్.డి. వైష్ణవి -- 595/600, జెడ్పీ ఉన్నత పాఠశాల, కోటపల్లి బాలికలు (పీలేరు మండలం)
- జి. ఆది విష్ణు -- 592/600, వివేకానంద మునిసిపల్ హైస్కూల్, మదనపల్లె
- జి. కీర్తన -- 591/600, ఏపీ మోడల్ స్కూల్, చిన్నమండెం
- డి. అఖిల -- 591/600, ఏపీ మోడల్ స్కూల్, పెనగలూరు
- ఎస్. సుష్మా తాజ్ -- 590/600, జెడ్పీ ఉన్నత పాఠశాల, మాసాపేట (రాయచోటి మండలం)

జిల్లా యంత్రాంగం తరఫున విజేతలందరికీ కలెక్టర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనురాధ, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బ్ర. మఠంలో బీజేపీ సంబరాలు

**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** ప్రస్తుతం జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో మూడు రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ విజయదుంబి మోగించడం శుభపరిణామని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి అన్నారు. అస్సాం, పశ్చిమబెంగాల్, పాండిచ్చేరి రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ గెలవడంతో సోమవారం మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి సెంటర్ సమీపంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మిఠాయిలను పంచడం జరిగిందన్నారు. మహిళా బిల్లును పార్లమెంటు సమావేశాలలో తిరస్కరించిన పార్టీలను మహిళలు తిరస్కరించారన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వాన్ని ఆ ప్రాంత ప్రజలు కూకటివేళ్లతో పెకలించి వేశారన్నారు మిఠాయిల పంపిణీ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రకాంత ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి బుసెట్టిసుధాకర్ కటారు రమణ తదితరులు పాల్గొన్నారు.



# గాలివాన బీభత్సానికి అరటి పంట నేలపాలు

- కోతకు వచ్చే సమయంలో విరుచుకుపడ్డ గాలివాన
- లక్షల్లో పంట నష్టం, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకోలు



**వేంపల్లె – సూర్య వాస్తవం :** ఆదివారం రాత్రి వచ్చిన గాలివాన భీభత్సానికీ అరటి పంట పూర్తిగా నేలమట్టమైన ఘటన మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన రైతు కె.చంద్ర మోహన్ రెడ్డి సాగుచేసిన మూడు ఎకరాల అరటి తోట పూర్తిగా ధ్వంసమైంది. సుమారు 800 చెట్లు నేలమట్టమయ్యాయి. పంట కోతకు వచ్చే సమయంలో అమ్ముకుంటే నాలుగు రాళ్లు వస్తాయని ఆశించిన తరుణంలో ఆకాల వర్షం రైతు ఆశలను అడియాశలు చేసింది. అప్పులు చేసి సాగు చేసిన పంట కళ్ల ముందే నాశనం కావడంతో రైతు చంద్రమోహన్ రెడ్డి కన్నీరు మున్నీరుగా ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి, తమకు తగిన నష్టపరిహారం అందించాలని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# ఉత్తమ ప్రతిభ కనబరిచిన మోడల్ స్కూల్ విద్యార్థిని

- కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేత




**పామిడి– సూర్య వాస్తవం:** పామిడి మోడల్ స్కూల్ విద్యార్థిని పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచినందుకు సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న మోడల్ స్కూల్ విద్యార్థినీ ఎంఈఓ జయ నాయక్ మోడల్ స్కూల్ విద్యార్థి కె. మనస్విని 586 మార్కులతో మండల టాపర్ ప్రైవేట్ స్కూళ్ల కంటే మోడల్ స్కూల్ ముందంజలో ఉందని స్కూల్ ప్రిన్సిపాల్ అరుణకుమారి స్కూల్ యజమాన్యం ఉత్తమ ప్రతిభ కనబరిచిన మనస్వినినీ అభినందించారు .

# ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం

- ఎంఏఓ శ్రీదేవి





**చెన్నూరు–సూర్య వాస్తవం :** రైతులు ప్రకృతి వ్యవసాయం పాటించడం ద్వారా భూమి సారవంతమవడంతో పాటు సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, వానపాములు సమృద్ధిగా పెరుగుతాయని, దీనివల్ల మొక్కల ఆరోగ్యం మెరుగుపడుతుందని చెన్నూరు మండల వ్యవసాయ అధికారి కే. శ్రీదేవి తెలిపారు. చెన్నూరు మండలం బయనపల్లె (కొండపేట) గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ నేచురల్ ఫార్మింగ్ -- నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కమ్యూనిటీ రీసెర్చ్ పర్సన్స్, గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మొదటి రోజు ప్రీమాన్ సన్ డ్రై సోయింగ్, ఏటీఎం (ూాఅం ుఅఎవ వీశీఅర్బతీవ) పద్ధతులపై ప్రదర్శనలు నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఏఓ శ్రీదేవి మాట్లాడుతూ, పీఎండీఎస్ (ాపీణూ) కింద పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, ఆకుకూరలు వంటి పంటలను 25--30 ఎకరాల్లో మిశ్రమ పద్ధతిలో సాగు చేయాలని సూచించారు. ఎకరాకు సుమారు 25 కిలోల విత్తన మిశ్రమాన్ని ప్రధాన పంటగా విత్తాలని తెలిపారు. ఈ విధానం వల్ల సంవత్సరంలో 365 రోజులు భూమి పంటతో కప్పబడి ఉండి, నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. అలాగే, వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బీజవృతం, బంకమట్టి, ఘన జీవామృతం, బూడిద వంటి పదార్థాలతో విత్తన గుళికలు తయారు చేసి భూమిపై చల్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంఎంటి గంగిరెడ్డి, వెంకటయ్య, శ్రీనివాసులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు, ట్రైనీలు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )